ఫ్యాన్సీ నంబర్‌కు 25.50 లక్షలు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 20 (నమస్తే తెలంగాణ): రవాణాశాఖలో ఫ్యాన్సీ నంబర్లకు ఉండే క్రేజీ మామూలుగా ఉండదు. నచ్చిన నంబర్ కోసం లక్షలు వెచ్చించేందుకు కూడా వాహన యజమానులు వెనకాడడంలేదు. అందుకు తాజా నిదర్శనం సోమవారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయ పరిధిలో టీజీ 09 9999 ఫ్యాన్సీ నంబరు కోసం ఓ కంపెనీ రూ.25.50 లక్షలు వెచ్చించి ఆన్‌లైన్ వేలంలో సొంతం చేసుకుంది. ఈ ధరరవాణా శాఖ చరిత్రలోనే పెద్దదని జేటీసీ రమేశ్ తెలిపారు. సోనీ ట్రాన్స్ సొల్యూషన్స్ కొత్తగా కొనుగోలు చేసిన టొయోటా ల్యాండ్ క్రూజర్ ఎల్ఎక్స్ వాహనానికి టీజీ 09 9999ను అధిక మొత్తాన్ని బిడ్ వేసి సొంతం చేసుకుందని వెల్లడించారు. అదేవిధంగా టీజీ 09 ఏ 0006ను రూ.2.76 లక్షలు, టీజీ 09 ఏ 0005ను రూ.1,80,200కు, టీజీ 09 ఏ 0019ను రూ.1,20,019కు, టీజీ 09 9799ను రూ.1,16,111కు, టీజీ 09 ఏ 0009ను రూ.1,10,009కు వాహనదారులు ఆన్‌లైన్ వేలంలో సొంతం చేసుకున్నారని రవాణాశాఖ జేటీసీ తెలిపారు.

భార్య నుంచి రక్షించండి

అర్ధనగ్నంగా ఠాణాకు బాధితుడు

బాన్సువాడ, మే 20: భార్య తరచూ తనను కొడుతున్నదని, న్యాయం చేయాలని ఓ వ్యక్తి అర్ధనగ్నంగా వచ్చి పోలీసులను ఆశ్రయించాడు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ సీఐ కృష్ణ వివరాల ప్రకారం.. బాన్సువాడకు చెందిన ఓ వ్యక్తి(50) చెడ్డిపై ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. అర్ధనగ్నంగా ఉన్న ఆయనను చూసి పోలీసులు అవాక్కయ్యారు. తన భార్య నిత్యం కొడుతున్నదని, తనకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నాడు. ముందుగా దవాఖానకు వెళ్లి చూయించుకుని రావాలని పోలీసులు అతడికి సూచించారు. కాసేపటికే ఆయన కూతురు వచ్చి అతడిని ఇంటికి తీసుకెళ్లింది.

ఫర్నిచర్‌తో వెళ్తున్న లారీ చోరీ

కొత్తకోట, మే 20: డ్రైవర్‌ను కొట్టి లారీని ఎత్తుకెళ్లిన ఘటన వనపర్తి జిల్లా జాతీయ రహదారి -44పై చోటు చేసుకున్నది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ఓ లారీలో ఫర్నిచర్‌ను తీసుకెళ్తున్నారు. ఆదివారం రాత్రి డ్రైవర్ మురుగన్ మల విసర్జన కోసం వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని కడుకుంట్ల స్టేజీ వద్ద వాహనాన్ని నిలిపాడు. గమనించిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు డ్రైవర్‌పై రాయి, సీకుతో దాడి చేసి లారీతో ఉడాయించారు. గాయపడిన మురుగన్ కొత్తకోటలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు.

జైలులో మృతిచెందిన ఖైదీ భార్యకు రూ.7.20 లక్షల పరిహారం

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): జైలులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తూ తోటి ఖైదీ దాడిలో మృతిచెందిన మరో ఖైదీ భార్యకు 6% వడ్డీతో రూ.7.20 లక్షల పరిహారం చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. వివరాల్లోకి వెళ్తే.. 2012 జూలై 4న చర్లపల్లి జైలులో దాసరి నరసింహులు అనే ఖైదీ దాడిలో ఐదుగురు ఖైదీలు గాయపడ్డారు. వారినిలో మెదక్ జిల్లాకు చెందిన కర్రోళ్ల వెంకయ్య అనే ఖైదీ గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ మరణించడంతో మానవహక్కుల కమిషన్ ఆదేశం ప్రకారం ఆయన భార్య జయమ్మకు 2018లో ప్రభుత్వం లక్ష రూపాయల పరిహారాన్ని అందజేసింది. అనంతరం ఆమె 10 లక్షల రూపాయల పరిహారాన్ని కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జయమ్మకు ఏటా రూ.57,600 చొప్పున గత 11 సంవత్సరాలకు కలిపి రూ.6,33,600తోపాటు అంత్యక్రియలు, ఇతర ఖర్చుల కింద మరో రూ.84 వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందులో ఇప్పటికే చెల్లించిన రూ.లక్షను మినహాయించి మిగిలిన మొత్తాన్ని 6% వడ్డీతో చెల్లించాలని జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ఇటీవల తీర్పు ఇచ్చారు.

రూ.3.04 కోట్లు సీజ్

విడుదలకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, మే 20, (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మిర్యాలగూడ నుంచి నల్లగొండ వెళ్తున్న వాహనంలో సీజ్ చేసిన రూ.3.04 కోట్ల సొమ్మును విడుదల చేసేందుకు రాష్ట్ర హైకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారానికి సంబంధించి మాడుగులపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టివేయాలని, ఆ సొమ్మును విడుదల చేయాలని కోరుతూ సికింద్రాబాద్‌కు చెందిన నీనా కమలేశ్ షా దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ఇటీవల విచారణ జరిపారు. ఎన్నికల సంఘం (ఈసీ) ఆదేశాలతో ఆ నగదును స్వాధీనం చేశామని, ఈ కేసులో పిటిషనర్ నిందితుడు కాదని పోలీసుల తరపు న్యాయవాది తెలిపారు. దీంతో కమలేశ్ షా వినతిపై స్పందించలేమని జస్టిస్ భాస్కర్‌రెడ్డి స్పష్టం చేస్తూ.. ఆయన పిటిషన్‌ను కొట్టివేశారు.

సన్నవడ్లకే బోనస్.. దొడ్డువడ్లకు ధోకా

- ఎన్నికల హామీపై సర్కారు నాలుక మడత
- రాష్ట్రంలో దొడ్డు వరి సాగు 90 శాతం
- సన్నాలు సాగయ్యేది 30 శాతమే
- మార్కెట్లోనే సన్నాలకు భారీ డిమాండ్
- కొనుగోలు కేంద్రాలకు రానివాటికి బోనస్!
- 70 శాతం సాగయ్యే వడ్లకు బోనస్‌పై దగా
- ఆర్థిక భారాన్ని తగ్గించుకునే ప్లాన్
- సర్కారు తీరుపై అన్నదాత ఆగ్రహం

హైదరాబాద్, మే 20(నమస్తే తెలంగాణ): వరికి క్వింటాలుకు రూ. 500 బోనస్ అంటూ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ బోగస్ అని తేలిపోయింది. బోనస్ అందరికీ కాదని, సన్నవడ్లకు మాత్రమేనంటూ తాజాగా ప్రకటించి దొడ్డురకం వడ్లు పండించే రైతులకు ధోకా ఇచ్చింది. అది కూడా రానున్న వానకాలం సీజన్ నుంచి మాత్రమేనని తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలోను, పార్టీ మ్యానిఫెస్టోలోనూ ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పారు తప్పితే సన్నవడ్లు అని పొరపాటున కూడా ఎక్కడా చెప్పలేదు. ఇప్పుడేమో తీరిగ్గా సన్నవడ్లకే ఇస్తామని ప్రకటించడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

90 శాతం రైతులకు మొండిచెయ్యి

రాష్ట్రంలో సన్నవరి పండించేది అతికొద్దిమందే. వానకాలంలో 30-35శాతం మంది పండిస్తే, యాసంగిలో అది 10-15 శాతానికి పరిమితమవుతుంది. అదే సమయంలో దొడ్డు రకం వరి వానకాలంలో 70 శాతం, యాసంగిలో 90 శాతం సాగవుతున్నది. అలాంటిది మెజార్టీ రైతులు పండించే వడ్లకు కాదని, అతి తక్కువమంది పండించే సన్నవడ్లకు బోనస్ ఇస్తామనడంపై రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

మార్కెట్లో సన్నాలకే డిమాండ్

దొడ్డురకం ధాన్యంతో పోలిస్తే బహిరంగ మార్కెట్‌లో సన్నవరికే డిమాండ్ అధికం. ప్రైవేటు వ్యాపారులు, మిల్లర్లు పోటీపడి కల్లాల వద్దకు వచ్చి మరీ కొంటారు. ఫలితంగా మద్దతు ధరకు మించి రూ. 500-700 వరకు అదనంగా లభిస్తుంది. కాబట్టి వాస్తవంగా చెప్పుకోవాలంటే సన్నాలకు బోనస్ ఇవ్వాల్సిన అవసరం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. వానకాలం సాగయ్యే పంటలో 20-25 శాతాన్ని ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తే పది శాతం ధాన్యాన్ని రైతులు తమ అవసరాల కోసం దాచుకుంటారు. మిగిలిన 5-10 శాతం ధాన్యాన్ని మార్కెట్లో విక్రయిస్తారు. కాబట్టి కొనుగోలు కేంద్రాలకు వచ్చేది సెకండ్ గ్రేడ్ సన్నాలే. అలాంటప్పుడు కొనుగోలు కేంద్రాలకు రాని వడ్లకు బోనస్ ఎలా ఇస్తారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. బోనస్ ఇస్తేగిస్తే డిమాండ్ లేని దొడ్డువరికి ఇవ్వాలని కానీ, ఇదెక్కడి అన్యాయమంటూ రైతులు మండిపడుతున్నారు.

సన్నాల్లోనూ మళ్లీ మెలిక

సన్న ధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇందులోనూ మరో మెలిక పెట్టింది. అన్ని రకాల సన్నాలకు బోనస్ ఇవ్వబోమని, వ్యవసాయశాఖ సూచించిన సన్న ధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఆ సన్నరకాల జాబితాను వ్యవసాయశాఖ త్వరలోనే వెల్లడిస్తుందని పేర్కొన్నారు. రైతుల్లో ఇది మరింత గందరగోళానికి కారణమైంది. వ్యవసాయ శాఖ పేర్కొన్న జాబితాలో లేని సన్నాలను సాగుచేసే రైతుల పరిస్థితి ఏంటన్నది అంతపట్టడం లేదు.

రైతులకు ఏటా 6 వేల కోట్ల నష్టం

సన్నాలకు బోనస్ అన్న ప్రభుత్వ ప్రకటనతో రైతులు భారీగా నష్టపోనున్నారు. ప్రతి ఏడాది ప్రభుత్వం వానకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి 1.20 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఉత్పత్తి ఎక్కువైతే అది 1.50 కోట్ల టన్నులు కూడా ఉండే అవకాశం ఉన్నది. ఇందులో 97 శాతం దొడ్డురకం ధాన్యమే ఉంటుంది. ఈ లెక్కన చూసుకుంటే టన్నుకు రూ. 500 బోనస్ చొప్పున 1.20 కోట్ల టన్నులకు రూ. 6 వేల కోట్ల వరకు రైతులు నష్టపోయే అవకాశమున్నది. అదే సమయంలో ప్రభుత్వానికి ఆ మేరకు భారం కూడా తగ్గుతుంది. అందులో భాగంగానే ప్రభుత్వం ఇప్పుడు సన్నబియ్యం పల్లవి అందుకుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆదాయం సమకూర్చుకోలేక నానా తంటాలు పడుతున్న ప్రభుత్వం ఆర్థిక కష్టాలను ఏదోలా తగ్గించుకునే వ్యూహంలో భాగంగానే సన్నవడ్ల జపం చేస్తున్నట్టు చెప్తున్నారు.

కాంగ్రెస్‌పై రైతులు గరం గరం

సన్నవడ్లకు బోనస్ ప్రకటనపై రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. బోనస్ పేరుతో ప్రభుత్వం తమను దారుణంగా మోసం చేసిందని మండిపడుతున్నారు. ధాన్యానికి బోనస్ ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఓట్లు దండుకొని ఇప్పుడు సన్నవడ్లకే అని చెప్పడం భావ్యం కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమలు చేతకానప్పుడు హామీ ఇవ్వడం ఎందుకని ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

మరో హామీని తుంగలోతొక్కినట్టే!

మొదటిపేజీ తరువాయి...

క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామని ఆరు గ్యారెంటీల్లో భాగంగా హామీనిచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు మాట మారుస్తున్నదని మండిపడ్డారు. రైతులందరూ బోనస్ కోసం ఎదురుచూస్తుండగా, ఇప్పుడు సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని, అది కూడా వచ్చే సీజన్ నుంచి ఇస్తామని మంత్రులు ప్రకటించడం బాధాకరమని పేర్కొన్నారు. 90 శాతం రైతులు దొడ్డు రకం వడ్లనే పండిస్తారని, పదిశాతం పండే సన్నవడ్లకే మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుందని తెలిపారు.

ఈ దెబ్బతో తేలిపోయింది

ఎలాగైనా అధికారంలోకి రావాలన్న దురుద్దేశంతోనే తప్ప, రైతుల పట్ల, వ్యవసాయాభివృద్ధిపట్ల కాంగ్రెస్‌కు ఏమాత్రమూ చిత్తశుద్ధిలేదని మంత్రుల తాజా ప్రకటనతో స్పష్టమైందని హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతుభరోసా రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేల ఆర్థికసాయం హామీలను కూడా ప్రభుత్వం గాలికి వదిలేసిందని దుమ్మెత్తిపోశారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీని వాయిదాలతోనే సరిపెడుతున్నారు తప్పితే అమలుకు నోచుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సన్నవడ్లకు మాత్రమే బోనస్ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల వడ్లకు రూ. 500 చొప్పున బోనస్ చెల్లించాలని రైతుల పక్షాన హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ విషయాన్ని ముందుగానే గుర్తించి చెప్తే అలాంటిదేమీ లేదని బుకాయించారని, ఇప్పుడేమో ఎన్నికలు అయిపోగానే సన్నవడ్లకే బోనస్ అని ప్రకటించడం కాంగ్రెస్ దమననీతికి నిదర్శనమని మండిడ్డారు. పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధిచెప్పాలని నిరుద్యోగ యువతీయువకులకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

కిర్గిస్థాన్‌లో భారతీయ విద్యార్థులు క్షేమం

- అక్కడి దాడులపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా
- అందుబాటులో ఎంబసీ హెల్ప్‌లైన్
- భారత రాయబారి అరుణ్ కుమార్ ఛటర్జీ
- దౌత్యపరంగా పటిష్ట చర్యలు తీసుకోవాలి : మాజీ మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో భారతీయ విద్యార్థులపై జరిగిన దాడులపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. రాష్ట్ర ఉన్నతాధికారులు బిష్కెక్‌లోని భారత రాయబారి అరుణ్ కుమార్ ఛటర్జీని సంప్రదించి వివరాలు సేకరించారు. భారతీయ విద్యార్థులందరూ సురక్షితంగా ఉన్నారని, ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో స్పందించడానికి ఎంబసీ హెల్ప్ లైన్ పూర్తిగా పనిచేస్తున్నదని ఛటర్జీ హామీ ఇచ్చారని అధికారులు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షలు కొనసాగుతున్నాయని, భారతీయ విద్యార్థులందరూ సిద్ధమవుతున్నారని చెప్పారని తెలిపారు. అక్కడ జరిగిన ఘటనలో భారతీయ విద్యార్థులెవరూ తీవ్రంగా గాయపడలేదని, దవాఖానలో చేరలేదని ఛటర్జీ స్పష్టం చేశారని వెల్లడించారు. మరోవైపు, కిర్గిస్థాన్‌లోని తెలంగాణ విద్యార్థుల భద్రతపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. బిష్కెక్‌లోని భారతీయ విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న హింసాత్మక ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కిర్గిస్థాన్‌లోని తెలంగాణ విద్యార్థుల భద్రత కోసం వెంటనే పటిష్ట చర్యలు తీసుకోవాలని సీఎం కార్యాలయాన్ని, భారత ప్రభుత్వ అధికారులను, విదేశాంగ మంత్రి జైశంకర్‌ను, బిష్కెక్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని కోరారు.

మేడిగడ్డపై కేసీఆర్ మాటే నిజం

- అన్నదాతల ఆగ్రహంతో దిగొచ్చిన ప్రభుత్వం
- బరాజ్ కుంగుబాటుపై ఇన్నాళ్లూ రాద్ధాంతం
- రిపేర్లు, ఎత్తిపోతలు వదిలి రాజకీయం
- ఎన్నికల్లో లబ్ధికోసం కేసీఆర్‌పై బద్నాం
- తీరా నీళ్లందక లక్షలాది ఎకరాల్లో పంటనష్టం
- రైతుల కోపాగ్నికి జడిసి మరమ్మతులకు నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ సర్కార్

హైదరాబాద్, మే20 (నమస్తే తెలంగాణ): 'అనుభవమైతేగాని ఏదీ తెలిసి రాదు'. ఇలానే ఇప్పుడు రైతుల కోపాగ్ని తాకితేగాని కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ సర్కారుకు తత్వం బోధపడలేదు. నిన్నటిదాకా ప్రాజెక్టే నిరర్థకం, నిష్ప్రయోజనమని మాట్లాడిన నోటితోనే ఇప్పుడు మరమ్మతులు చేసి నీటిని ఎత్తిపోస్తామని సోమవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ప్రకటించింది. ప్రాజెక్టును బందు పెట్టడం వల్ల జరిగిన నష్టమేమిటో బోధపడడంతో దిద్దుబాటుచర్యలు చేపట్టింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పినా పెడచెవిన పెట్టి, పిల్లర్ల కుంగుబాటుపై రాద్ధాంతం చేసి.. లక్షలాది ఎకరాలను ఎండబెట్టి చివరికి రైతుల ఆగ్రహాన్ని చవిచూశాక ఇప్పుడు తప్పు తెలుసుకున్నది. ఎన్డీఎస్ఏ నివేదిక ఆధారంగా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన బరాజ్‌ల మరమ్మతులకు సంసిద్ధత తెలిపింది.

ఇన్నాళ్లూ తప్పుడు ప్రచారం

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ 7వ బ్లాక్‌లోని 20పిల్లర్ కుంగుబాటునకు గురైన విషయం తెలిసిందే. ఆ ఒక్క సాంకేతిక లోపాన్ని సాకుగా చూపి మొత్తం ప్రాజెక్టే నిష్ప్రయోజనమనే తప్పుడు ప్రచారానికి కాంగ్రెస్ పూనుకున్నది. ఇదే ఎన్నికల ప్రచార అస్త్రంగా చేసుకొని రాజకీయ లబ్ధికోసం అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు కూడా కూలిపోతాయంటూ విషం చిమ్మింది. అధికారంలోకి వచ్చాక బరాజ్‌ల మరమ్మతులు మాని, రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలి, కేవలం రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట వేసుకున్నది. ప్రాజెక్టు పేరిట కేసీఆర్‌ను బద్నాం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నది. మంత్రులు, ముఖ్యమంత్రి స్వయంగా బరాజ్‌లను సందర్శించి మరీ అవి నిష్ప్రయోజనం, నిరర్థకం, వృథా అంటూ కొండెక్కి కూశారు. అసెంబ్లీ వేదికగా అబద్ధపు ప్రచారం చేశారు. నీటి ఎత్తిపోతలు ఆపేసి, అప్పటికే బరాజ్‌లలో నిల్వ ఉన్న నీటిని సైతం దిగువకు వృథాగా వదిలేశారు. దీంతో యాసంగిలో ప్రాజెక్టు పరిధిలోని లక్షలాది ఎకరాలు సాగునీరందక ఎండిపోయాయి. పదేళ్లలో ఎన్నడూ లేనంతగా భూగర్భజలాలు పడిపోయాయి. ఫలితంగా రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వచ్చింది.

కేసీఆర్ చెప్పినా పెడచెవిన..

మేడిగడ్డ బరాజ్‌ను పునరుద్ధరించవచ్చని, అది పెద్ద సమస్య కాదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, రాష్ట్ర ఇంజినీరింగ్ నిపుణులు సైతం మొదటినుంచీ కాంగ్రెస్ ప్రభుత్వానికి చెబుతూ వస్తున్నారు. మేడిగడ్డ బరాజ్ ఎగువన చిన్న పాటి అడ్డుకట్ట వేస్తే నీటిని లిఫ్ట్ చేసుకునే వెసులుబాటు ఉంటుందని నొక్కి చెప్పారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. రైతుల్లో అసహనం, ఆగ్రహం పెరిగాక ఇప్పుడు ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ నివేదికను ముందుపెడుతూ బరాజ్‌లను మరమ్మత్తులు చేయించాలని నిర్ణయించినట్టు వెల్లడించింది. వచ్చే వానకాలంలో నీటిని లిఫ్ట్ చేసే అంశాలపైనా దృష్టి పెట్టినట్టు స్పష్టం చేసింది. ఇదేదో యాసంగిలోనే చేసి ఉంటే లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోకపోయేవని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సమావేశానికి హాజరైన కాంగ్రెస్ నాయకులు

'అమ్మ-ఆదర్శ' మీటింగ్‌కు కాంగ్రెస్ నేతలు

కోడ్ ఉల్లంఘనపై ఎంపీపీ సరోజన ఆగ్రహం

మల్లాపూర్, మే 20: అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సమావేశానికి సభ్యులకు బదులు కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. అధికార పార్టీ నాయకులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడంపై పలువురు అభ్యంతరం తెలిపారు. సోమవారం జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల పరిషత్ ఆఫీసులో అమ్మ-ఆదర్శ పాఠశాలల కమిటీ సమావేశం నిర్వహించారు. మహిళా సభ్యులకు బదులు కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. సమావేశంలో ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, పీఆర్ ఏఈ నిరంజన్, ఏపీఎం దేవరాజ్, అధికారులు పాల్గొన్నారు. ఈ వ్యవహారంపై మల్లాపూర్ ఎంపీపీ సరోజన ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులు సైతం నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారని, ఎన్నికల కోడ్ ఉండగా కాంగ్రెస్ నాయకులకు సమావేశానికి అనుమతించడం ఏంటని? ప్రశ్నించారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని వెల్లడించారు. ఈ విషయంపై ఎంపీడీవో రాజేందర్‌రెడ్డిని వివరణ కోరగా ఈ సమావేశం జరిగింది వాస్తమేనని, ఏర్పాట్లను పీఆర్ ఏఈ అధికారి చూశారని వెల్లడించారు.

నా భూమిని తిరిగి ఇప్పించండి

ప్రభుత్వానికి స్వాతంత్ర్య సమరయోధుడి కుమారుడి విజ్ఞప్తి

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): స్వాతంత్ర్య సమరయోధుల కోటాలో తమకు ప్రభుత్వం కేటాయించిన భూమిని తిరిగి ఇప్పించాలని సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం బైరాన్‌పల్లికి చెందిన రైతు చల్లా మల్లారెడ్డి విజ్ఞప్తి చేశారు. తన సమస్యను చెప్పేందుకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కోసం సోమవారం సచివాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ఎదురుచూసినా కలువలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మల్లారెడ్డి మాటల్లో.. 'నా తండ్రి చల్లా రాంరెడ్డి స్వాతంత్ర్య సమరయోధుడు. 2006లో రాష్ట్ర ప్రభుత్వం నా తండ్రికి జనగామ జిల్లా జనగామ మండలం పరసమడ్ల గ్రామంలోని సర్వే నంబర్ 140/14లో 2 ఎకరాలు కేటాయించింది. నా తండ్రి మరణించే ముందు ఆ భూమిని వారసుల పేర్ల మీద వీలునామా రాశారు. 2020లో రెవెన్యూ అధికారులు ఆ భూమిలో వ్యవసాయం చేయడం లేదంటూ మాకు నోటీసు ఇచ్చారు. కొన్నేండ్లుగా బోరు వేసుకొని సాగుచేసుకుంటున్నామని ఆధారాలు చూపించినా పట్టించుకోకుండా స్థలాన్ని ఖాళీగా ఉంచామంటూ పట్టా రద్దు చేశారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించగా.. నాలుగు నెలల్లో పరిష్కరించాలని జనగామ కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ విషయంపై ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేశా. అయినా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. హైకోర్టు ఇచ్చిన గడువు కూడా పూర్తవుతున్నా నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. నా దరఖాస్తు ఇప్పటికీ కలెక్టర్ వద్ద పెండింగ్‌లో ఉన్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భూమిని ఇప్పించాలి' అని వేడుకొంటున్నా.

వడ్లు కొనే బాధ్యత కలెక్టర్లదే

మొదటిపేజీ తరువాయి...

మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించినట్టు పొంగులేటి వివరించారు. ధాన్యం కొనుగోలు బాధ్యత కలెక్టర్లదేనని సీఎం ఆదేశించారని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెల్లడించారు. తడిసిన ధాన్యానికి కూడా మద్దతు ధర చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్లకు ఆదేశాలు జారీచేశామని వివరించారు.

సన్న వడ్లకే బోనస్

సన్న వడ్లు పండించే రైతులను ప్రోత్సహించేందుకు వీటికి మాత్రమే బోనస్ చెల్లించాలని మంత్రిమండలి నిర్ణయించినట్టు పొంగులేటి తెలిపారు. హాస్టళ్లు, మధ్యాహ్న భోజనానికి, రేషన్‌షాపుల్లో కిలో రూ.2 బియ్యం పథకానికి సన్నబియ్యం ఇస్తామని తమ ప్రభుత్వం ప్రకటించటంతో, సన్న వడ్లు పండించే రైతులకే క్వింటల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని స్పష్టం చేశారు. సన్న వడ్లకు సంబంధించిన మార్గదర్శకాలను వ్యవసాయశాఖ ప్రకటిస్తుందని అన్నారు. ఎన్నికలకు ముందు అన్ని వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు సన్నవడ్లకు మాత్రమే ఇస్తామని చెప్పిన విషయాన్ని మీడియా గుర్తు చేయగా, 'ప్రస్తుతం సన్న వడ్లకు బోనస్ ఇస్తాం, ఆ తర్వాత విడతల వారీగా మిగతావాటికి కూడా వర్తింపచేస్తాం' అని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. నకిలీ విత్తనాలు అమ్మేవారిని కఠినంగా శిక్షస్తామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు రశీదులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

అమ్మ ఆదర్శ కమిటీలకు పాఠశాలల నిర్వహణ బాధ్యత

విద్య పట్ల తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని, ఆ దిశగా కార్యాచరణకు మంత్రిమండలి నిర్ణయించిందని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రతి గ్రామంలో 'అమ్మ ఆదర్శ కమిటీలు' ఏర్పాటుచేసి, వాటికి పాఠశాలల నిర్వహణ బాధ్యత అప్పగిస్తామని వెల్లడించారు. అందుకుగాను రూ.120 కోట్లు అడ్వాన్స్‌గా ఈ కమిటీలకు ఇచ్చి అత్యాధునిక పాఠశాలలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. దీనికోసం మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని మంత్రిమండలి నిర్ణయించినట్టు తెలిపారు.

కాళేశ్వరానికి మరమ్మత్తులు

కాళేశ్వరం ప్రాజెక్టుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) మధ్యంతర నివేదిక ఇచ్చిందని, దీనిపై కూడా మంత్రిమండలి చర్చించినట్టు పొంగులేటి తెలిపారు. ఎన్డీఎస్ఏ తన మధ్యంతర నివేదికలో ప్రధానంగా ప్రభుత్వానికి మూడు సూచనలు చేసిందని చెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మూడు బరాజ్‌లలో నిర్మాణ లోపాలు ఉన్నట్టు చెప్పిందని వెల్లడించారు. భవిష్యత్తులో మరింత నష్టం కలగకుండా, వీటికి ప్రమాదం వాటిల్లకుండా గేట్లు తెరిచే ఉంచాలని సూచించిందని వివరించారు. మరమ్మత్తులు చేసినా ప్రమాదం ఉండదన్న గ్యారెంటీ ఇవ్వలేమని ఎన్డీఎస్ఏ స్పష్టం చేసిందని తెలిపారు. మరమ్మత్తులు చేసేపక్షంలో వాటిని కేంద్ర ప్రభుత్వ సంస్థల ద్వారానే చేయాలని, దీనికి రెండు సంస్థల నుంచి సలహాలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించినట్టు మంత్రి తెలిపారు. బరాజ్‌లలో నీటిని నిలువ ఉంచకుండా ఎత్తిపోయాలని సూచించిందని వివరించారు. రాక్ ఫార్మేషన్ చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నదని వెల్లడించారు. ఆవిర్భావ వేడుకలకు మాజీ సీఎం కేసీఆర్‌ను ఆహ్వానిస్తారా? అని మీడియా ప్రశ్నించగా, తమకు ఎలాంటి భేషజ